ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అమరావతి గుంటూరు
20
మంగళవారం 22 డిసెంబర్ 2015



# 'అక్కినేని' పురస్కారాల ప్రదానం నేడు



డాక్టర్ తోటకూర ప్రసాద్



కొత్త సుబ్రహ్మణ్యం



ఎంపీ కన్నేశ్వరరావు

**తెనాలి:** మహా నటుడు అక్కినేని నాగేశ్వరరావు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం తెనాలిలో మంగళవారం జరగనుంది. వెన్నం ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, నట సామ్రాట్ డాక్టర్ అక్కినేని ఇంటర్నేషనల్ ఫ్యాన్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఐదుగురు ప్రముఖులకు అక్కినేని ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు. పురస్కారాలు అందుకునే వారిలో తానా మాజీ అధ్యక్షుడు డాక్టర్ తోటకూర ప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, నటుడు, రచయిత, దర్శకుడు ఎంపీ కన్నేశ్వరరావు, సంగీత దర్శకుడు బొల్లిముంత కృష్ణ, ప్రముఖ వైద్యుడు యడ్ల బ్రహ్మాజీరావు ఉన్నారు. కొత్తపేట రాధాకృష్ణ కల్యాణ మండపంలో పురస్కారాల ప్రదానం జరుగుతుందని డాక్టర్ అక్కినేని ఇంటర్నేషనల్ ఫ్యాన్స్ కార్యదర్శి జి.రామనాగేశ్వరరావు తెలిపారు. గతంలో తమ సంస్థ తరఫున దర్శకుడు కె.విశ్వనాథ్, సహజ నటి జయసుధ, మాటల రచయిత గణేష్ పాత్రో, దర్శకుడు వీబీ రాజేంద్రప్రసాద్, ఎస్.గోపాలరెడ్డి, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి వంటి ప్రముఖులకు పురస్కారాలు అందజేశామన్నారు. ఎన్నారై వెన్నం మురళి నెలకొల్పిన వెన్నం ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఈ కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం జరిగే అవార్డుల ప్రదానోత్సవంలో ఎస్పీ రామారావు, అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఉపాధ్యక్షుడు రవి కొండబోలు, డైరెక్టర్లు డాక్టర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ధామ భక్తవత్సలు పాల్గొంటారని, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షత వహిస్తారని వివరించారు.



బొల్లిముంత కృష్ణ



డాక్టర్ బ్రహ్మాజీరావు

# అక్కినేని జీవితం రోల్ మోడల్

- తానా మాజీ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్



పురస్కారాలు అందుకుంటున్న తోటకూర ప్రసాద్, సుబ్రహ్మణ్యం, కన్నేశ్వరరావు, కృష్ణ, బ్రహ్మాజీరావు

తెనాలి అర్బన్, డిసెంబరు 22 : విశిష్ట వ్యక్తిత్వం ఉన్న నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు జీవితం నేటితరానికి రోల్ మోడల్ అని తానా మాజీ అధ్యక్షుడు ప్రసాద్ తోటకూర అన్నారు. అక్కినేని ప్రతిభా పురస్కారాల ప్రదానం మంగళవారం రాత్రి గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించారు. వెన్నం ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, అక్కినేని ఇంటర్నేషనల్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ఐదుగురు ప్రముఖులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. తోటకూర ప్రసాద్‌తోపాటు కొత్త సుబ్రహ్మణ్యం, ఎంపీ కన్నేశ్వరరావు, బొల్లిముంత కృష్ణ, డాక్టర్ యడ్ల బ్రహ్మాజీరావు ఉన్నారు. పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షతన జరిగిన సభలో తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ, అక్కినేని వంటి మహోన్నత వ్యక్తిత్వం కలిగిన వారు చాలా అరుదని, ఆయన పేరిట పురస్కారం అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. అక్కినేని జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు 16



బుధవారం 23 డిసెంబర్ 2015

# అక్కినేని జీవితం స్ఫూర్తిదాయకం

## - తానా మాజీ అధ్యక్షుడు ప్రసాద్ తోటకూర







అక్కినేని పురస్కారాలు అందుకుంటున్న తోటకూర ప్రసాద్, కొత్త సుబ్రహ్మణ్యం, ఎంపీ కన్నేశ్వరరావు

**తెనాలి అర్బన్ :** మహా నటుడు, విశిష్ట వ్యక్తి నట సామ్రాట్ అక్కినేని జీవితం యువతకు స్ఫూర్తిదాయకం కావాలని తానా మాజీ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్ పేర్కొన్నారు. వెన్నం ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, అక్కినేని ఇంటర్నేషనల్ ఫ్యాన్స్ తెనాలి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి తెనాలిలో అక్కినేని ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. తానా మాజీ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, డాక్టర్ యడ్ల బ్రహ్మాజీరావు, రచయిత ఎంపీ కన్నేశ్వరరావు, సంగీత దర్శకుడు బొల్లిముంత కృష్ణలను అక్కినేని పురస్కారాలతో సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ప్రసాద్ మాట్లాడుతూ అక్కినేని జీవితం ద్వారా యువతలో స్ఫూర్తి కలిగించేందుకు, సమసమాజ స్థాపనే లక్ష్యంగా ఫౌండేషన్ పని చేస్తుందన్నారు. చివరి నిమిషంలో కూడా అక్కినేని కాన్ఫరెన్స్ కాల్‌లో అందరితో ముచ్చటించారని గుర్తు చేశారు. ధీశాలిగా పేరొందిన అక్కినేని మృత్యువుతో పోరాడారని ఆయన పేరిట అమెరికాలో 89 నాణేలను, పోస్టల్ స్టాంపులను ముద్రించామన్నారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు రవి కొండబోలు మాట్లాడుతూ తమతో మిత్రులుగా ఉన్న అక్కినేని అమెరికాకు 29 సార్లు వచ్చారని, ఆయనకు ఆతిథ్యం ఇచ్చానని చెప్పారు. ఆయన చూపే ఆప్యాయత, అభిమానం ఎనలేనివన్నారు. ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దేవదాసు సినిమాను హృదయంతో చూశానంటూ అక్కినేని సినీ గేయాలను మధురంగా ఆలపించారు. అనితర సాధ్యమైన అక్కినేని వైద్యానికి కూడా అందని మిరాకిల్ వంటి వారని చెప్పారు. బైపాస్ సర్జరీ అయిన తర్వాత 15 ఏళ్ల కన్నా ఎక్కువ బతికే అవకాశం ఉండదని, కానీ 40 ఏళ్లు బ్రతికిన అక్కినేనిని ఓ మిరాకిల్‌గా అభివర్ణించారు. పాజిటివ్ దృక్పథం, క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం ఉన్న ఆయన ఏమి చదువుకోకపోయిన అన్ని విషయాలను ధారాళంగా మాట్లాడాతారని పేర్కొన్నారు. తన ఆశావాదమే ఆరోగ్య రహస్యమని చెప్పినట్లుగా గుర్తు చేశారు. డాక్టర్ బ్రహ్మాజీ మాట్లాడుతూ, తెలుగు సినిమాకు ఏఎన్ఆర్, ఎన్టీఆర్ రెండు కళ్లుగా ఎందరికో స్ఫూర్తినిచ్చారని చెప్పారు. సినీ విజ్ఞాన విశారద ఎస్వీ రామారావు మాట్లాడుతూ, శిల, శిల్పి అన్ని ఆయనే అని అక్కినేనిని అభివర్ణించారు. సభలో డాక్టర్ నన్నపనేని ప్రతాప్, డాక్టర్ జీవనలత, జి.రామనాగేశ్వరరావు, కాకుమాను రాంబాబు, శివన్నారాయణ, షేక్ ఇబ్రహీం, జమ్ముల ప్రవీణ్, కన్నెగంటి తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి అక్కినేని చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ సినీనటుడు రంగనాధ్ మృతికి సంతాపం ప్రకటించారు.





పురస్కారం అందుకుంటున్న బొల్లిముంత కృష్ణ, డాక్టర్ బ్రహ్మజీరావు